

# ॥ దేశమంటే మనుషులోయ్

"నేను మాట సాయం చేయడానికొస్తాననీ మీవాడు పోస్టర్లేశాడంటగా! మరీ తెలుగు మీరి పోతున్నాయే ప్రాపగండా పద్ధతులూ" అన్నాడు రామిరెడ్డిగారు.

"అబ్బే చౌదరిగారు కారు ఆయన మీద పోటీ చేస్తున్న పంతులే వేయించాట్ట" అన్నాడు సుబ్బరాజు కూర్చుంటూ.

రామిరెడ్డిగారు చుట్టముట్టించే ప్రయత్నంలో మునిగిపోయారు – ఆయన ఊహ తప్పయినందువల్ల. అలా అయినపుడల్లా చుట్టముట్టించడం రివాజు.

"అన్నట్టు నిన్నొచ్చిన పిల్లది కులాసా?" అన్నాడు కులాసాగా పొగ వదలి నవ్వి.

సుబ్బరాజు నెమ్మదిగా తలెత్తి ఆయన వంక క్షణంలో సగం వేపు చూసి తలవంచుకున్నాడు.

రెడ్డిగారు పొడిదగ్గు దగ్గి, మళ్ళీ పోస్టరు గొడవ మీదికి మళ్ళించారు మాట.

"ప్రాపగాండా జాగర్తగా చెయ్యాలి. కొత్త పద్ధతులుండాల్సిందేననుకో. రామదాసు గారనీ – ఉద్దండుడులే – ఆయన ప్రజాసేవేమిటో దేవుడికే తెల్సుగాని ప్రాపగాండా మజా ప్రజలకే తెలుసు. గారడి అనుకో. ఎలక్షను వేళకి వచ్చి వాలేవాడు. అదయిపోయాక మళ్లీ ఎలక్షను దాకా పికరుండడు అయినా గెలిచాడంటే అది ఆ మనిషి గొప్పతప్ప మరేటి జెప్పు" అంటూ కథ ఆరంభించాడు రెడ్డిగారు.

ఓమా రెలక్షను కిలాగే పైనుంచి దిగొచ్చాడు. రివాజుగా ఉండే పరివారంతో బాటు ఓ కవిగారు కూడా చేరాడు. దారి పొడుగునా ఆయన అదే ఆశ్చర్యపోడం ఇలా అర్ధాంతరంగా వెళితే, అవుసరానికి మొఖం జూపిస్తే ప్రజలు మీ మొఖం జూస్తారా అన్నాడు. కాని, పోనుపోనూ దేశ మధ్యానికి వచ్చేసరికి ఓటర్లను చూసేసరికి ఆయన అభిప్రాయం కొంతమారింది. కష్టమే వీళ్ళందరితోనూ నెగ్గుకు రావడం అన్నాడు. సామాన్యపు జనం విరగబడి చూడ్డానికి రాలేదు – మంత్రిగారు మనూరొచ్చారు గదా అని.

రావదాసుగారు ఓ క్షణం ఆలోచించి, మోటారుకి కొంచెం అవటాలగా ఉన్న రెండెడ్ల బండి దగ్గర కెళ్ళాడు. "ఏం రెడ్డీ బాగున్నావా?" అంటూ ఆ బండెక్కి కూచొని, "పోనీ ఊళ్ళోకి" అన్నారు. రెడ్డి నివ్వెరబోయాడు. అక్కడున్న జనం ముక్కున వేలేసుకున్నారు. కొంచెం పై మీద తెలివున్న ఆసామి చప్పట్లు కొట్టాడు.

అక్కడితో అందరూ కొట్టారు. కారణం తెలిసినవాళ్ళూ, తెలీనివాళ్ళూ కూడా సందడికి పదిమందీ బండి చుట్టూ చేరారు.

దాసుగారు రెడ్డి భుజం తట్టారు "మేము నాయకులమని పేరేగాని మమ్మల్ని నిలిపేవాళ్ళూ నడిపేవాళ్ళూ మీరే! ఇదిగో నీ బండిలో కూర్చున్నట్టే, నువ్వు తీసికెళ్ళే దారినే నేనిపుడు రావాలి గదా. నువ్వే నాయకుడివి" అంటూ ప్రజల నుద్దేశించి ఉద్ఘోషించి మళ్ళీ ఓ మారు రెడ్డి భుజం ఉందనుకొన్నచోట తట్టారు. రెడ్డి వీపు ముందుకు వంగి తొట్టిలో గడ్డి సవరిస్తున్నందువల్ల ఆ భుజానికీ, ఈ హస్తానికీ భేటీ కుదరలేదు దాసుగారి చెయ్యి కొయ్యమీద పడింది. వెంటనే ఆయన ఇంకోసారి దాన్ని చరిచి "గట్టి కొయ్యే?" అన్నారు. జోకు తాత్పర్యం తెలీకపోయినా చుట్టూ ఉన్నవారు ఆయన గౌరవార్థం గొల్లున నవ్వారు.

రెడ్డి ఈ లోపల అవతలి కొయ్య కేసి చొక్కా దీసి తొడిగి, తలపాగా చుట్టి సగర్వంగా నలుదిక్కులా చూసి "పదేస్" అన్నాడు. బండి కదిలింది.

దాసుగారు చెయ్యందించి కవిగారిని పైకి లాక్కున్నారు. మిగతా వారు కర్తవ్యం తోచక, బళ్ళెక్కాలా నడవాలా కారెక్కాలా అన్నది తేలక తటపటాయిస్తున్నారు. "మీరంతా వెళ్ళి బసదగ్గరుండండి. నేనూ కవిగారూ రెడ్డితో వెళ్ళి ఊరు చూసొస్తాం" అన్నాడు దాసుగారు.

"పూర్ డాడీ" అంది దాసుగారమ్మాయి కారెక్కుతూ. "ఇండియా హోజింట్ ఛేంజ్ డే బిట్, యూనో" (ఇండియా రవ్వంత కూడా మారలేదు. నీకు తెలుసా అని తాత్పర్యం) అన్నాడు ఏణ్ణర్థం నించి అమెరికా వెళ్ళాలనుకుంటున్న దాసుగారి కుమార్డు.

దారి పొడుగునా దాసుగారు బండి మీద కూర్చుని చేసిన సందడి అంతా ఇంతా కాదు. బండి వెనక చాలామంది జనం పోగయ్యారు. దాసుగారు ఆ జనంలో చాలామందిని గుర్తుపట్టారు. "చౌదరీ! ఇల్లెంతవరకూ వచ్చింది? డాబా మీద గదులు వేయించావా?...ఏవండి పంతులుగారూ దయలేదు. ఒంట్లో బాగుందా? ఏయ్ బండబ్బాయ్, ఏరా, బాగున్నావా...? నువ్వు సుబ్బిగాడి కూతురువి గాదుటే? ఎంత మారిపోయావూ..." మధ్యలో ఓసారి ఈల వేశారు దూరంగా పోతున్న ఆసామికేసి చూసి. "వాడు నా చిన్ననాటి నేస్తంలెండి, వాడే ఈల నేర్పాడు నాకు" అన్నారు సిగ్గుపడుతూ, జనం చప్పట్లు కొట్టారు.

"మరీ బడాయిగాపోతే.... దాసుగారు ఈ కిల్లాడి వేషాలు తెగవేస్తాడు" అన్నారెవరో బండి పక్కనించి పోతూ. వాడు చలపతిగారి హంగుదారు, పేరు సుబ్బారావో ఏదో ఉండాలి.

"అంతేనయ్యా. మీకు ఓటేసిన జనంతో సరదాగా ఉండడం కిల్లాడి వేషమే మరి మీ దృష్టిలో. మీరు జనాన్ని మరిచిపోతారు, పలకరించడం అవమానమనీ పబ్లికున చెప్పకుంటారు. నాకు చేతగాదు" అన్నారు దాసుగారు గట్టిగానే.

దగ్గరున్న జనం చప్పట్లు కొట్టారు.

ఎక్కణ్ణించో ఓ చుట్టపీకె వచ్చి పడింది – దాసుగారి మీద. అది ఎందరు చూశారో తెలీదు. కాని దాసుగారు ఓ పుల్లముక్కకి ఆ చుట్టని గుచ్చి పైకెత్తి పట్టుకున్నారు. "నా రాజ్యంలో జనం ఇంతింత పెద్దచుట్టలు పారేసుకోగలిగినంత

గొప్పవాళ్ళవుతారు. చెప్పవయ్యా, ఈ మాట మీ చెలవయ్యగారికి" అంటూ విసిరేశాడు. జనం గొల్లుమన్నారు.

"దేవాంతకమ్ముండా కొడుకు" అన్నారెవరో. దాసుగారు ఈ మాట విని పొంగిపోయాడు.

అప్పుడేవిటి ఆ క్షణం నించి ఆయనలా అదే పనిగా పొంగిపోతూనే ఉన్నారు పోటు తగిలిన సముద్రంలా.

ఊళ్ళో వేసిన రెండు మీటింగులూ బ్రహ్మాండంగా జరిగాయి. దాసుగారి ధాటికీ, చమత్కారాలకీ, విసుర్లకీ జనం విపరీతంగా చప్పట్లు కొట్టారు. ఓసారి "కర్మణ్యే వాధి కారస్తే" శ్లోకం చెప్పి, "మీ వంతు మీరు ఓటు వెయ్యండి, మనందరం కష్టపడదాం, భగవంతుడు తప్పక సత్ఫలితం ఇస్తాడు" అన్నారాయన ఉద్వేగంతో.

"కితం సారెలక్షనులో దేవుళ్లేడన్నావు ఇప్పుడెక్కణ్ణించి వచ్చాడు?" అని గావు కేకేశారెవరో గిట్టనివాళ్ళు. "రైట్, అప్పుడు లేడు. లేడనబట్టే దరిమిలాను కనబడ్డాడు. దేవుళ్ళేకపోతే, నువ్వూ నేనూ ఇలా ఉంటామా?" అన్నారు దాసుగారు. విట్టు అద్భుతంగా లేకపోయినా జనం విరగబడి నవ్వారు మీటింగు ఊపునుబట్టి.

తరువాత కవిగారు ప్రత్యేకించి మెచ్చుకోబోయేవరకు "ఏడిసినట్టుందా విట్టు" అని ఆయనే అన్నాడు.

"ఎలాగైనా ఒక్క విషయం చెప్పకోక తప్పదండి. ఆ రాజధాని వైభోగం మధ్య తమర్ని చూసిన కళ్ళతో ఇక్కడ ఈ జనాభా మధ్య చూస్తే ఎలాగో ఉంది. శాపం వల్ల స్వర్గం నుండి భూమికి పతనమైన దేవత అనిపిస్తుంది" అన్నారు కవిగారు.

దాసుగారు ఆయన వంక తేరిపార చూశారు. హేళనా! అమాయకత్వమా? అని పక్కున నవ్వారు. "కవిగారూ, మీ ఊహ మంచిదే గాని ఉపమానం బాగులేదు. శాపంవల్ల భూపతనం చెందింది అనేది ఎలక్షనులో ఓడిపోయి జనంలో కలిసిపోయినపుడు నప్పతుంది, ఇది లైసెన్సు రెన్యూ చేయించుకోడమే. అంచేత స్వర్గం నుంచి పిక్నిక్కు రావడం లాటిది" అన్నారు.

ఓ క్షణం ఆగి, "ఇదీ న్యాయం కాదనుకోండి, మా నాయనమ్మ పాటిమట్టి దిబ్బలమ్మి, నన్ను పట్నవాసపు స్వర్గంలో ఉంచి చదివించింది... అంచేత మన ఊరుని, మన జనాన్ని నేనలా కనికష్టంగా తీసిపారెయ్యలేను" అన్నారు.

"ఆహా విలవైన మాటన్నారు" అంటూ, ఛైర్మనుగారూ, మిత్రులూ లోపలికి వచ్చారు, వారిలో ఉట్టి కల్తీలేని ఓటర్లు కూడా ఉన్నారు.

అప్రయత్నంగానే అపాటి విలువైన మాటన్నందుకు, అనిపించినందుకు దాసుగారు మనసా దేవుడికో దండం పెట్టుకున్నారు మనసులో.

ఓ అరగంట తరువాత రాపాడిసిన పెద్దలు పదిమందీ వచ్చారు. ఎలక్షను బలాబలాలు బేరీజులు వేశారు. 'ట్రయాంగిల్ ఫైటు' ఉండదని తేలింది. పోటీ ఉన్నది చలపతిరావుగారు. ప్రాపగాండాకి తగలేసే దాంట్లో ఓ లక్ష ఇటు పారేద్దాం; మానేస్తాడేమో కనుక్కోమన్నారు. ఓ యస్ అన్నాడటాయన నవ్వి. పరాచికం కాబోలు అన్నాడు వెళ్ళొచ్చినాయన చిన్నబుచ్చుకుని. ఇంకా నయం; లక్షా పుచ్చుకుని చివరి నిమిషంలో దగా చేస్తే ఏం చేదుము అన్నాడింకొకాయన.

"చెయ్యనిండి, పోటీచేస్తే చెడేదతనే! చూస్తున్నాం గదా రెండ్రోలుమట్టీ - జనం దాసుగారి మీద ఎంత మోజుగా ఉన్నారో?"

"మరే. అసలు ఆ రెండెడ్ల బండి దెబ్బతోటే ఈయన్నెగ్గేశాడురా అనిపించింది నాకు"

"సర్లెండి - మరి పబ్లిసిటీ గురించి ఆలోచించండి - ఎన్ని మీటింగులో, ఏయే వూళ్ళో -" అన్నారు ఛైర్మనుగారు.

"13, 18, 22, 23, 29, 3, 7, 10 తేదీలు మాత్రం ఏం పెట్టకండి. నాకు ఆ తేదీల్లో ఫంక్షన్లున్నాయి. ఏవో ప్రారంభోత్సవాలూ, సినిమా షో, రెండు పార్టీలు, రెండు నేనిచ్చేవి ఏడిశాయి, ఒద్దు మొర్రో అన్నా. వినలేదు అవతలి వాళ్ళు...." అన్నారు దాసుగారు.

సభలో నిశ్శబ్దం ఆవరించింది.

"దాసుగారూ మనకెంత ప్రజాబలం ఉన్నా బొత్తిగా ఎలక్షను ప్రచారం కూడా అశ్రద్ధ చేస్తే.... ఇప్పుడేనా కాస్త వాళ్ళ కంటబడకపోతే"

"అశ్రద్ధేముందండి? ప్రచారం చేస్తేనే ప్రజాసేవ చేసినట్టా?"

"దాసుగారు చేసిందానికి పబ్లిసిటీ ఇచ్చుకోలేదు గాని నిజానికాయన ఎంతో సేవ చేశాడు. అడిగిన వాళ్ళలో నూటికి తొంభై మందికి ఉద్యోగాలు వేయించాడు. లంచాలు పట్టారన్న నేరాలపై ఖైదు పడబోయిన వారిని వారి తల్లిదండ్రుల క్షోభ చూళ్ళేక ఆదుకుని ఉద్యోగాలు కూడా పోకుండా నిలబెట్టించాడు - కొందరు మన్యం ట్రాన్సుఫరు అయితే అవుగాక! క్లబ్బు రోడ్డులో మెర్క్యూరీ లైటు వేయించాడు సొంత డబ్బుతో, అయిదారుసార్లు పెద్ద ఫిలిము స్టార్లను తెప్పించాడు. తన వూరి వాళ్ళకు లైసెన్సు లిప్పించాడు. ఎటొచ్చీ రోజూ వచ్చి "ఓహో! నేను సేవ చేస్తున్నాను. మీరు చూసి పద్దు రాసుకోండి" అని జనానికి చెప్పుకోలేదు. ఇందమ్మటే తిరిగితే "నువ్వెక్కడ లీడరువయ్యా, వంటింట్లో తారట్లాడతావూ" అంటారు. రాచకార్యాలకి నడుం బిగించినవాడు రాజవీధిలోనే ఉండాలి.

"అయినా, కాపోయినా దాసుగారు జనాన్ని చూడకపోవటమేమిటి? ఆ మాటకొస్తే ఆయనకి కంఠతా వచ్చినన్ని బీద ఓటర్ల పేర్లు ఈ దేశంలో ఇంకెవరికీ రావు. చలపాయిగారి కసలే రావు. ఈయన గుర్తుపట్టినంతమందిని, ఆయన్ని గుర్తు పట్టమనండి చూద్దాం" అన్నాడొకాయన ఆవేశంతో.

"మరె ఆయన వాళ్ళ గ్రూపు వాళ్ళనే గుర్తుపట్టలేడు. చత్వారం గదా" అన్నాడొక చమత్కారి. అందరూ గొల్లుమన్నారు.

మొత్తంమీద దాసుగారు కళ్ళు మూసుకు గెలవవచ్చునని తేలింది మీటింగులో. అయినా ఆయనకి అనుమానం తీరలేదు. "ఎందుకేనా మంచిది, రెండు ఫంక్షనులు కాన్సిలు చేసుకుంటాను. నాలుగు వూళ్ళూ తిరిగితే సరి ఓమారు" అన్నారు.

"అబ్బే ఎందుకండీ?" అన్నాడాయన సెక్రటరీ.

"అసలు వూటీ ట్రిప్పు మానేదునుగాని, మా ఫ్యామిలీ పట్టుబడుతోంది, మళ్ళీ మళ్ళీ పడుతుందో పడదో, ఓసారి వెళ్దామా అని."

"ఊటీ ఏమిటె, స్విట్జర్లాండెళ్ళచ్చు"

అయినా సరేనని వారం తరవాత టూరు ఆరంభించారు దాసుగారు. ఆ యాత్రలో ప్రజల సంరంభం చూసి ఆయనే ఆశ్చర్యపోయాడు. తనంటే ఇంత ప్రేమ, ఇంత గౌరవం ఉన్నాయన్న సంగతి తెలిసి ఒళ్లు పులకరించింది. చాలా వూళ్ళకీ, వాడలకీ అసలు వెళ్ళాల్సిన అవసరమే లేకపోయింది. వూరి శివారులోనే వూరి పెద్దలు మేళతాళాలతో యెదురై స్వాగతమిచ్చారు. అక్కడే ఆతిథ్యం ఇచ్చి, "ఈ వూరి ఓట్లన్నీ మీకే తథ్యం" అని హామీ ఇచ్చారు, మాకు చెబితే ఓటీ, మా వాళ్ళకి చెబితే ఓటీనా అన్నారు. వాళ్ళు చెబితే మేము చెబితే మరోటీనా అనికూడా అన్నారు.

వెళ్ళవలసిన వూళ్ళు చాలా ఉన్నందువల్ల దాసుగారు, మిత్రుల సలహాపై ఇహా నా వూళ్ళోకెళ్ళకుండానే ముందు వూరికి యాత్ర సాగించారు. ప్రతిచోటా ఇలాగే అద్భుతమైన స్వాగతం. చాలా వర్గాల నుంచి, వారివారి నాయకులే స్వయంగా దాసుగారి బసకి వచ్చి మంచీ చెడ్డా మాట్లాడి కావలసిన హామీలు పుచ్చుకున్నారు. "ఇహ ఫరవాలేదు. మీరు కళ్ళు మూసుకు మీ పని చూసుకోండి. ఓట్లు మీకే. నూటికి నూరూ పడేలా చూసే పూచీ కూడా మాదే!" అని భరోసా ఇచ్చారు.

దాసుగారికి ధైర్యం ఏర్పడింది. ప్రచారానికి పెద్ద ఎత్తున ధన సహాయం చేస్తామన్న పెద్దలు ముగ్గురు మధ్యలో తగాయిదా వచ్చి తప్పుకోడంతో డబ్బు కిరకాటమైంది. భయపడ్డాడు. నూటికి పాతిక రూపాయల మీద వడ్డీకి అప్పు తీసుకోవాలని కూడా అనుకున్నాడు. కాని అనుకోని ఈ ప్రజాదరణతో ఈ గడ్డు సమస్య తప్పింది.

ఇక ప్రచారంలో వాగ్దానాలకు లోటేం చెయ్యలేదు దాసుగారు. దానికేం లోటు గనక? చలపతిగారు ఒకటంటే తను పది అన్నాడు. అనిపించాడు. ఆయన ఆసుపత్రులు బాగుచేయిస్తాననంటే, తాను ఉద్యానవనాలు వేయిస్తానన్నాడు. ఆయన తారు రోడ్లంటే తను కాంక్రీటు పోయిస్తానన్నాడు. ఓసారి ఆయన ఒక వర్గం వారికి పింఛను ఇప్పిస్తామన్నాడుట. దాసు వర్గం వారు పింఛన్లకి ఇంక్రిమెంట్లు ఇప్పిస్తామన్నారు. మెడ్రాసెళ్ళి వచ్చిన దాసుగారిది విని నవ్వి "మీ మొహంలా ఉంది. పింఛన్ల కింక్రిమెంట్లేమిటి?" అన్నాడు. అంతలో కొందరు పెద్దవారొచ్చి ఆ విషయం గురించి ఆశగా మాట్లాడటంతో ఆయనకు నవ్వూ ఏడుపూ ముందుకొచ్చాయి. "సర్లెండి; చూదాం" అన్నాడు ఇంకేమనాలో తోచక.

మొత్తంమీద దాసుగారు అన్ని మీటింగులకీ హాజరైనా మానినా, అటు రాచకార్యాలు కూడా చూసుకుంటూ ఇటు తన మిత్రులు, అనుచరుల అండదండలతో ఈ వ్యవహారాలు, నడిపిన ప్రచారం దివ్యంగా సాగాయి. పోలింగు బ్రహ్మాండంగా జరిగింది.

"సుబ్బరాజా! చలపతిగారు గెలిచాడంటావా?" అన్నారు రెడ్డిగారు కథ ఆపి.

"ఆహా. నిక్షేపంలా గెలిచుంటాడు. దాసుగారికి ధరావతు కూడా గల్లంతై పోయుంటుంది. చిత్తుగా ఓడిపోయుంటాడు" అన్నాడు సుబ్బరాజు.

"అదేవిటలా అంటావు?"

"మీరు పెట్టించిన హెడ్డింగును బట్టి చూస్తే దాసుగ్గారు మనుష్యుల్ని మనుషులుగా చూడలేదు, గొర్రెల మందలా లెక్కేశాడు. ఆయన చేసిన ఉపకారాలన్నీ ప్రజాసేవ అనిపించుకోవు. ఆశ్రితులనీ, లంచగొండ్లనీ ఆదుకుంటే ప్రజలకేం ఒరుగుతుంది?

ఆయనకి ప్రతి చోటా ఎదురేగి, "మా ఊరి ఓట్లు మీవే" అని భరోసా ఇచ్చిన పెద్దలంతా చలపతిరావు గ్రూపు మనుషులు. వాళ్ళ మాట నమ్మి, ప్రచారం చేసుకోకుండా దాసుగారు దగాపడ్డాడు. పోతే ఆయన చేసిన వాగ్దానాలూ అలాగే ఉన్నాయి. ప్రజలు ఎంత గొర్రెలయినా వాళ్ళకున్నాడా తెలివితేటలు నమ్మశక్యంగానంత గొప్పగా ఉన్నాయి. దేశమంటే మనుషులని కానుకోక నేల విడిచి సాము చేశాడు దాసుగారు" అన్నాడు సుబ్బరాజు.

రామిరెడ్డిగారు పెదవి చప్పరించి "నువ్వు జెప్పింది రైటేగాని, ప్రజల మీద నీకు మరీ ఇంతటి పిచ్చి నమ్మకాలుంటే నెగ్గిరాలేవు సుమా" అంటూ లేచి లోనికి వెళ్ళారు.

* * *